



రైతులతో మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మర్మత్

సర్వే కొనసాగుతుంది!

ఎయిర్‌పోర్టు భూములపై రైతులతో కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు కోసం భూములను సేకరిస్తున్న ప్రాంతంలో సర్వే కొనసాగుతుందని కడా పీడీ వికాస్ మర్మత్ స్పష్టం చేశారు. శాంతిపురం మండలం రామాపురం, రామకుప్పం మండలం కిలాకిపోడు గ్రామాల మధ్య ఎయిర్ పోర్టుకోసం భూముల సేకరణ ప్రక్రియ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ భూములున్నవారు కొందరు గ్రీవెన్స్ డేలో సోమవారం పీడీని కలిశారు. నోటీసులు ఇవ్వకుండానే సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీనిపై పీడీ వారికి సమాధానమిస్తూ, విస్తృతమైన ప్రజా ప్రయోజనాలకోసం ఒక అభివృద్ధి చేయాలనుకున్నప్పుడు ప్రభుత్వానికి భూములు సేకరించక తప్పదన్నారు. ఎయిర్‌పోర్టుతోపాటు కొన్ని పరిశ్రమల స్థాపనకోసం 1,800 ఎకరాల భూముల సేకరణకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం సర్వే జరుగుతున్నదని చెప్పారు. చాలావరకు రైతులు భూములు ఇవ్వడానికి ఇప్పటికే అంగీకారం తెలిపారన్నారు. మిగిలిన రైతులనుంచి కూడా అంగీకారం తీసుకోకుండా భూముల సేకరణ చేయబోమన్నారు. అయితే సర్వే పూర్తయ్యాక భూములు అవసరమైతే వారినుంచి కూడా తప్పకుండా సేకరిస్తామన్నారు. ఎయిర్‌పోర్టుకోసం ఎంచుకున్న ప్రాంతంలో భూముల విలువ ఎకరానికి రూ.5లక్షలు మాత్రమే ఉందన్నారు. అయినా సరే భూములు కోల్పోతున్న రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఎకరానికి ఏకంగా రూ.16 లక్షల నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం ముందుకొచ్చిందని గుర్తు చేశారు. అవసరమైన భూములను రైతులు అంగీకారపూర్వకంగా ఇస్తే, ఈ మొత్తం నష్టపరిహారం వారి అకౌంట్లలో జమవుతుందన్నారు. ఒకవేళ వారు అంగీకారం తెలుపకున్నా భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం ఆ భూములను సేకరిస్తుందని, అప్పుడు నష్టపరిహారం ప్రభుత్వ ధరల ప్రకారం ఎకరానికి కేవలం రూ.5 లక్షలు మాత్రమే దక్కుతుందని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వెలుపలికి వచ్చిన రైతులు.. యూనియన్ నాయకుడు ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాసేపు ఆందోళన చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు రావడంతో ఎక్కడివారక్కడ వెళ్లిపోయారు.

బోనమందకు మళ్లీ ఏనుగుల గుంపు

సోమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సోమల మండలానికి ఏనుగుల గుంపు మళ్లీ చేరుకున్నట్లు బోనమంద రైతులు తెలిపారు. రెండ్రోజుల కిందట మండలాన్ని ఒంటరి ఏనుగు వీడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం గుంపు రావడంతో భయపడుతున్నారు. పేటూరు, అన్నెమ్మగారిపల్లె, ఆవులపల్లె, పెద్ద ఉప్పరపల్లె తదితర పంచాయతీల్లో వేల ఎకరాల్లో మామిడి, టమోటా పంటలు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం మామిడి కోతలు చేయాల్సి ఉండగా, టమోటా కోతలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తోటల్లోకి ఎక్కడ ఏనుగులు వస్తాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడీ కేంద్రాలను భవనాల కొరత వెంటాడుతోంది. వీటిని గత వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. నాడు-నేడు పథకం కింద ఆర్భాటంగా చేపట్టిన భవన నిర్మాణాల్లోనూ ఒక్కటీ పూర్తి చేయలేదు. ప్రస్తుతం ఈ అసంపూర్తి భవన నిర్మాణాలను పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి



గుడిపాల మండలం చీలాపల్లెలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ కేంద్ర భవనం



సోమల మండలం వల్లిగట్లపల్లె పంచాయతీలోని కొత్తపల్లెలో అంగన్వాడీ కేంద్ర భవనం దుస్థితి

అద్దె భవనాల్లోనే అంగన్వాడీ కేంద్రాలు

- వైసీపీ హయాంలో గాలికొదిలేశారు
- ప్రస్తుతం అసంపూర్తి నిర్మాణాలను పూర్తిచేయడంపై దృష్టి పెట్టిన ప్రభుత్వం
- రూ.11.47 కోట్లతో ప్రతిపాదనలు

జిల్లాలో 2,420 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 1,795 మెయిన్, 625 మినీ కేంద్రాలు. 2014-19లో టీడీపీ హయాంలోనే కొన్ని భవనాలను నిర్మించింది. ప్రస్తుతం 577 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. 2015-18 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాకు 164 అంగన్వాడీ కేంద్రాలకు భవనాలను మంజూరు చేసింది. నాబార్డు, గృహ నిర్మాణ శాఖ, ఉపాధి హామీ పథకం నిధులను విడుదల చేసింది. అప్పట్లో భవనాల నిర్మాణ పనులు వేగంగా జరిగాయి. చివరి దశకు చేరుకునేలోపు 2019లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో పనులు ఆగిపోయాయి. తదనంతరం వైసీపీ ప్రభుత్వం ఈ పనులను గాలికొదిలేసింది. అసంపూర్తి భవనాలను ప్రస్తుతం పశువుల కొట్టాలుగా స్థానికులు వాడుకుంటున్నారు.

'నాడు-నేడు' కిందా పూర్తి చేయలేదు

టీడీపీ హయాంలో మంజూరై వివిధ దశల్లో ఉన్న భవన నిర్మాణ పనులను పూర్తి చేయకుండానే వైసీపీ ప్రభుత్వం కొత్తగా 81 భవనాలను మంజూరు చేసింది. భవన నిర్మాణానికి రూ.13 లక్షల వంతున విడుదల చేస్తామని చెప్పి.. కొంతవరకు మాత్రమే విడుదల చేసింది. కాంట్రాక్టర్లు సగం పనులను చేసి బిల్లులు పెట్టారు. రాకపోవడంతో పనులను ఆపేశారు. నాడు-నేడు కింద చేపట్టిన ఐదేళ్లలో ఒక్క భవనాన్నీ కూడా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురాలేదు.

రూ. 11.47కోట్లతో తాజాగా ప్రతిపాదనలు

టీడీపీ హయాంలో నిలిచిపోయిన భవనాలు, నాడు-నేడు పథకం కింద అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిధులపై ప్రతిపాదనలు పంపాలని ఆదేశించింది. ఐసీడీఎస్, ఇంజనీరింగ్ శాఖలు పరిశీలించి రూ.11.47 కోట్లకు ప్రతిపాదనలను పంపాయి.

తలకు మించిన భారంగా అద్దెలు

అద్దె భవనాల్లో నడుస్తున్న 577 అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి అద్దెల భారం ఎక్కువైంది. గ్రామాల్లో అయితే పిల్లలు మధ్యాహ్నం భోజనం చేయడానికి డైనింగ్‌హాలు, క్లాస్ రూమ్‌తోపాటు ఆటస్థలం, మరుగుదొడ్లు వంటి సదుపాయాలుంటే రూ.2వేలు, పట్టణాల్లో రూ.6వేల వరకు ప్రభుత్వం అద్దెను చెల్లిస్తోంది. అంగన్వాడీ కేంద్రానికి సరాసరిగా రూ.4వేలు అనుకున్నా.. నెలకు 577 కేంద్రాలకు రూ.23 లక్షల వరకు అద్దెను చెల్లిస్తున్నారు.

ఇబ్బందులు ఇలా..

గర్భిణుల రక్తహీనత, ఇతర సమస్యలను నివారించడానికి సరుకులు ఇవ్వాల్సి ఉంది. మధ్యాహ్నం పిల్లలకు బలవర్ధక ఆహారాన్ని అంగన్వాడీ కేంద్రాల్లోనే అందిస్తారు. పిల్లలు భోజనం చేసేందుకు, చదివేందుకు వేర్వేరుగా గదులు ఉండాలి. ప్రస్తుతం ఒకే గదిలో తినడం, పడుకోవడం, ఆడుకోవడం ఇబ్బందిగా మారింది.

మొరాయించిన సర్వర్

కొత్త సాఫ్ట్‌వేర్‌తోనూ బియ్యంకార్డుదారులకు తప్పని ఇక్కట్లు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాలు కొత్తకళతో ఆదివారం పునః ప్రారంభమయ్యాయి. అయితే చాలాచోట్ల సర్వర్ మొరాయించడంతోపాటు కొత్త సాఫ్ట్‌వేర్ కారణంగా బియ్యం కార్డుదారులకు ఇక్కట్లు తప్పలేదు. ముందస్తుగా కొన్ని దుకాణాలకు పది శాతం సరుకులను అదనంగా జిల్లాలోని 14 ఎంఎల్ పాయింట్ల ద్వారా అందజేశారు. అధికారులు తొలిరోజే ఎక్కువ శాతం పంపిణీ చేయాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేయడంతో చాలా దుకాణాల వద్ద లబ్ధిదారుల రద్దీ పెరగడంతో సర్వర్‌పై ఒత్తిడి ఎక్కువై మొరాయించింది. సోమవారం కూడా ఇదే పరిస్థితి అన్ని దుకాణాల వద్ద కనిపించింది. ప్రభుత్వం ఈ-పోస్‌లో గతంలో వినియోగించిన 8.9 వెర్షన్ బదులు 9.0 వెర్షన్‌కు సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశారు. ఈ కారణంగా కూడా డీలర్లకు ఒత్తిళ్లు అధికమయ్యాయి. దీనిపై డీఎస్వో శంకరన్ మాట్లాడుతూ.. రెండు, మూడ్రోజులపాటు ఇలాంటి బాలారిష్టాలు సహజమన్నారు. అన్నిచోట్లా సమస్యలను పరిష్కరించుకుని సరుకులను డీలర్లు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. సోమవారం వరకు 5.36 లక్షల బియ్యం కార్డులకు 36.71 శాతం అంటే 1,97,062 కార్డులకు, పోర్టబిలిటీ ద్వారా 33,797 కార్డులకు సరుకులను పంపిణీ చేసి.. రాష్ట్రస్థాయిలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం



చిత్తూరు పీసీఆర్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్న అధ్యాపకులు


చిత్తూరు సెంట్రల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యా సంవత్సరం ప్రారంభమైన తొలి రోజే జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించారు. ఏప్రిల్ 24 నుంచి మే 7వ తేదీ వరకు తొలి దశ అడ్మిషన్లు చేపట్టిన విషయం తెలిసిందే. సోమవారం అన్ని ప్రభుత్వ యాజమాన్య కళాశాలల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి.. రెండో దశ అడ్మిషన్లను మొదలుపెట్టారు. అధ్యాపకుల పోస్టులు గల్లంతు కాకుండా జాగ్రత్త పడుతున్న క్రమంలో అడ్మిషన్లు పెంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలు బలోపేతం చేసే దిశగా అధికారులు, అధ్యాపకులు చర్యలు తీసుకున్నారు. ఒక్కో అధ్యాపకుడు లక్ష్యాన్ని నిర్దేశించుకుని మరీ అడ్మిషన్లు చేయిస్తున్నారు. దీంతో గత ఏడాది కంటే ఈ దఫా ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెరిగే అవకాశాలున్నాయి.

రైతు కష్టం.. రోడ్డు పాలు!



సోమల సమీపంలో రోడ్డు పక్కన పారబోసిన తోతాపురి మామిడి కాయలు

సోమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తోతాపురి రకం మామిడి కాయలు నాణ్యత లేదని కొనేవారు కరువయ్యారు. ఒకవేళ కొన్నా గిట్టుబాటు ధర లభించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఏడాదిపాటు కష్టించి సాగుచేసిన మామిడి కాయలను ఏం చేయాలో తెలియక రైతులు.. రోడ్డు పాలు చేస్తున్నారు. సోమల - సదుం, సోమల - కలికిరి మార్గాల్లో రోడ్లపక్కన పారబోసిన మామిడి కాయలే కనిపిస్తున్నాయి.




పులిగుండు వద్ద జరిగిన యోగాంధ్రలో పాల్గొన్న ప్రజలు

2,300 మందితో యోగా



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ




పెనుమూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం పెనుమూరు మండలంలోని పులిగుండు వద్ద నిర్వహించారు. సుమారు 2,300 మంది పాల్గొన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌తోపాటు ఎస్పీ మణికంఠ తన సతీమణితో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. యోగాను దినచర్యలో భాగంగా చేసుకుంటే అనారోగ్య సమస్యలు రావని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ యోగా ప్రాధాన్యాన్ని తెలుసుకోవాలన్నారు. అనంతరం ప్రజలు, విద్యార్థులతో కలిసి అధికారులు, నాయకులు యోగాసనాలు వేశారు. పర్యాటక శాఖ అధికారి గౌరి, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్డీవో బాలాజి, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, తహసీల్దారు శ్రావణ్ కుమార్, టూరిజం అధికారి హరిప్రసాద్, ఏపీవో గుణ, ఏపీఎం చిరంజీవి, అంగన్వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, టీడీపీ నాయకులు కార్జాల అరుణ, రుద్రయ్యనాయుడు, తలారి రెడ్డెప్ప, మనోహర్‌రెడ్డి, ఎస్వీ సెట్ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో డీఎస్‌హెచ్ అధికారుల తనిఖీలు

చిత్తూరు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్(డీఎస్‌హెచ్) అధికారులు మంగళవారం తనిఖీ చేయనున్నారు. డీఎస్‌హెచ్ జాయింట్ కమిషనర్ రమేష్‌నాథ్, డిప్యూటీ కమిషనర్ రమేష్ కిషోర్, సెక్రటరీ పద్మాకుమారి, ఈఈ విజయభాస్కర్, బయో మెడికల్ ఇంజనీర్ సందీప్‌రెడ్డిలు కలిసి తనిఖీకి రానున్నారు. అలాగే ఇటీవల ఏపీ హంస అసోసియేషన్ నిర్వహించిన అత్యవసర ఎన్నికలపై విచారించనున్నట్లు తెలుస్తోంది.

స్వల్పంగా పెరిగిన టమోటా ధరలు



సోమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): టమోటాకు రెండు నెలలుగా ధరల్లేని విషయం తెలిసిందే. సోమవారం పుంగనూరు, పలమనేరు మార్కెట్లలో 15 కిలోల బాక్సు రూ.150 నుంచి రూ.180 వరకు చేరుకుంది. శనివారం వరకు 15కిలోల టమోటా బాక్సు ధర రూ.70లోపు ఉండింది. కొందరు రైతులు గిట్టుబాటు ధరలేక కూలీ కూడా రాదని కోతలు ఆపేశారు. ఈ పరిస్థితుల్లో మహారాష్ట్రలో భారీ వర్షాలతో టమోటా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో అక్కడికి మన జిల్లా నుంచి టమోటాలు ఎగుమతికి వ్యాపారస్తులు రావడంతో టమోటా ధరలు స్వల్పంగా పెరిగాయి. ఈ ధరైనా నిలకడగా ఉంటే కోతలు చేయవచ్చని రైతులు చెబుతున్నారు.

ఎఫ్‌సీ లేని బస్సులను సీజ్ చేస్తాం

- డీటీసీ నిరంజన్ రెడ్డి హెచ్చరిక



చిత్తూరు సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సీ (ఫిట్‌నెస్ సర్టిఫికెట్) లేని బస్సులను సీజ్ చేస్తామని జిల్లా రవాణాశాఖాధికారి (డీటీసీ) నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు తమ బస్సులకు ఎఫ్‌సీలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 835 బస్సులుండగా ఇప్పటి వరకు 720 వాహనాలకు ఎఫ్‌సీలు తీసుకున్నారన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యాక స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఎఫ్‌సీ లేని బస్సులను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

నిరంజన్ రెడ్డికి కడప డీటీసీగా అదనపు బాధ్యతలు

నిరంజన్ రెడ్డికి కడప డీటీసీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడప డీటీసీ ప్రసాద్ నెల రోజులపాటు సెలవుపై వెళుతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం స్థానిక జిల్లా పరిషత్ (జడ్పీ) మీటింగ్ హాలులో డీపీవో కె.సుధాకర్‌రావు ఆధ్వర్యంలో జరిగింది. ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారితోపాటు సొంత మండలంలో పనిచేస్తున్న వారు కూడా సీట్లను వదులుకున్నారు. గతంలో ఉత్పన్నమైన జీతాల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఒక గ్రేడువారిని అదే గ్రేడులో బదిలీలు చేశారు. గ్రేడ్-1లో 10మంది, గ్రేడ్-2లో 29 మంది, గ్రేడ్-3లో 66 మందికి స్థానచలనం జరిగింది. మంగళవారం గ్రేడ్-4 వారికి బదిలీల కౌన్సెలింగ్ జరగనుంది.

8న తిరుపతిలో
'హరిహర వీరమల్లు' ప్రీ రిలీజ్ వేడుక!
సినీ దిగ్గజాలు చిరంజీవి, రజనీకాంత్ రాక

తిరుపతి అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హీరోగా నటించిన 'హరిహర వీరమల్లు' ప్రీ రిలీజ్ వేడుక ఈనెల 8న తిరుపతి ఎస్వీయూ తారక రామ మైదానంలో జరగనున్నట్లు సమాచారం. ఈ మేరకు అనుమతి కోసం చిత్రనిర్మాత ఏఎం రత్నం ఎస్వీయూ వీసీకి లేఖ ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యఅతిథులుగా తెలుగు, తమిళ సినీ దిగ్గజాలు మెగాస్టార్ చిరంజీవి. సూపర్‌స్టార్ రజనీకాంత్, పవన్‌కల్యాణ్‌తో పాటు నటీనటులు నిధిఅగర్వాల్, బాబీడియోల్, సత్యరాజ్, మరో నిర్మాత దయకర్‌రావు హాజరు కానున్నట్లు సమాచారం. వీరంతా ఈవెంట్ ముగిశాక రాత్రికి తిరుమల చేరుకుని, మరుసటి రోజు ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నట్లు సమాచారం.

శ్రీవారి సేవలో ప్రముఖులు


సంజయ్ మూర్తి

తిరుమల, జూన్2 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా సంజయ్ మూర్తి, జనసేన స్టేట్ జనరల్ సెక్రటరీ బొలిశెట్టి సత్యనారాయణ, సినీనటుడు శుభలేఖ సుధాకర్, ఆయన సతీమణి, గాయని ఎస్పీ శైలజ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.


శుభలేఖ సుధాకర్, శైలజ

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.46 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,031

తలనీలాలు సమర్పించినవారు: 32,936



జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరిసిన జిల్లా విద్యార్థులు
● జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు కైవసం

తిరుపతి(విద్య), జూన్ 2(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో బీటెక్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జేఈఈ మెయిన్స్‌లో ఎంపికైన సుమారు వెయ్యి మంది ఈ పరీక్ష రాశారు. పలువురు జాతీయ స్థాయిలో ఉన్నత ర్యాంకులు పొందారు. తమ మనోభావాలను వారు 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

ఏఐలో రీసెర్చ్ చేస్తా



ఐఐటీ ముంబైలో సీటు సాధించి సీఎస్ఈ చదివి.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో రీసెర్చ్ చేయాలనేది నా ఆశయం. ఇందుకోసం కళాశాల అధ్యాపకులు ఎన్‌సీఈఆర్టీ పుస్తకాలను సమగ్రంగా అధ్యయనం చేయించారు. ఓల్డ్ పేపర్స్ ప్రాక్టీస్ చేయించారు. కళాశాలలో మాక్‌టెస్టులు, రివిజన్‌వల్ల సబ్జెక్ట్‌పై పట్టు వచ్చింది. అధ్యాపకుల సూచనల మేరకు చదువుతూ, సాధన చేశా. మా నాన్న జైభారత్, (ప్రైవేట్ కాలేజీలో గణిత అధ్యాపకుడు), అమ్మ సురేఖ ఎంతగానో ప్రోత్సహించారు.

- ఎం.భానుచరణ్‌రెడ్డి, ఓపెన్ కేటగిరిలో 51, ఈడబ్ల్యూఎస్ 4వ ర్యాంకు

ఖరగ్‌పూర్ ఐఐటీలో సీఎస్ఈ చదువుతా



ప్రతిష్ఠాత్మక ఖరగ్‌పూర్, చెన్నై ఐఐటీల్లో సీఎస్ఈ చదవాలనేది నా లక్ష్యం. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, నాన్న గిరిజా ప్రసాద్‌రెడ్డి స్ఫూర్తితో, అగ్రికల్చరల్ కళాశాల ప్రొఫెసర్ అయిన అమ్మ అమరావతి ప్రోత్సాహంతో ఇంజినీరింగ్ వైపు అడుగులు వేశాను. మా కళాశాల అధ్యాపకులు సూచించిన మేరకు చదివి ఉత్తమ ర్యాంకు తెచ్చుకోవడం సంతోషంగా ఉంది.

- దేశిరెడ్డి మణిదీప్‌రెడ్డి, 345వ ర్యాంకర్.

మద్రాస్ ఐఐటీలో సీఎస్ఈ చేస్తా



మద్రాస్ ఐఐటీలో సీఎస్ఈ చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరడాలనేది నా కోరిక. నాన్న నాగేంద్ర (వెటర్నరీ డాక్టర్) నాగేంద్ర, అమ్మ జ్యోతి ప్రోత్సాహంతో కష్టపడి చదివా. మా అధ్యాపకుల శిక్షణ, ఎన్‌సీఈఆర్టీ సిలబస్ అధ్యయనం, కళాశాలలో మాక్ టెస్టులు నన్ను నేను తీర్చిదిద్దుకునేందుకు ఎంతగానో ఉపకరించాయి.

- జి.హిమేష్ రాఘవచంద్ర, 468వ ర్యాంకు, ఓబీసీ విభాగంలో 61వ ర్యాంకు.

టాప్ 5 ఐఐటీల్లో చదవాలన్నది లక్ష్యం



దేశంలోని టాప్ ఐదు ఐఐటీల్లోని ఒకదానిలో సీఎస్ఈ చదవాలనేది నా లక్ష్యం. కష్టపడి చదివి మంచి ర్యాంకు తెచ్చుకోవడంతో నా లక్ష్యం నెరవేరబోతున్నందుకు ఆనందంగా ఉంది. నాన్న ప్రహ్లాద్ రెడ్డి (ప్రైవేట్ స్కూల్ టీచర్), అమ్మ రెడ్డిరాణి నన్ను కష్టపడి చదివించారు. మా కళాశాల అధ్యాకుల బోధన, వారి అత్యుత్తమ ప్రణాళిక నన్ను ఈ విజయబాటలో నడిపింది.

- ఎం.శశాంక్, 618వ ర్యాంకర్

ఐఐటీ ముంబైలో చదువుతా



మా కళాశాల అధ్యాపకుల నేతృత్వంలో ముంబై ఐఐటీలో సీటు సాధించాలనే పట్టుదలతో చదివాను. నాన్న కె.నాదమునిరెడ్డి (కెమిస్ట్రీ లెక్చరర్), అమ్మ ఎం.బిందు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు.

- కళత్తూర్ యశ్విత, 906వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్‌లో 67వ ర్యాంకు

గూడూరు విద్యార్థికి 535వ ర్యాంకు


తల్లిదండ్రులతో నితిన్‌రెడ్డి

గూడూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో ఇంటర్ చదివిన గూడూరు విద్యార్థి వేగూరు నితిన్‌రెడ్డికి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆలిండియా 535వ ర్యాంకు వచ్చింది. తండ్రి రవిచంద్రారెడ్డి (టీచరు), తల్లి సుచిత్ర (వెల్ఫేర్ అసిస్టెంట్), అధ్యాపకుల ప్రోత్సాహంతో తాను ఈ ర్యాంకును సాధించానని, ప్రతిష్ఠాత్మక ఐఐటీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదివి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా రాణించాలన్నదే లక్ష్యమని చెప్పారు.

వినుడు.. మా గోడు
కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 299 వినతులు ● రెవెన్యూ శాఖవే 158

● సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చూపొద్దన్న కలెక్టర్


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తమ గోడు పట్టించుకుని, సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీదారులు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు తరలివచ్చారు. వీరితో కలెక్టరేట్ కిక్కిరిసింది. వివిధ సమస్యలపై 299 అర్జీదారులు అందగా, అందులో 158 రెవెన్యూశాఖవే కావడం గమనార్హం. ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని, ఇందులో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను హెచ్చరించారు. పరిష్కరించలేని అర్జీకు వాటిపై ఫిర్యాదుదారులకు కారణాలు చెప్పాలన్నారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కాగా, పీజీఆర్ఎస్‌లో అధికారులకు కలవడానికి వచ్చే అర్జీదారులను ఒక క్రమ పద్ధతిలో సమావేశ మందిరంలోకి అనుమతించాలి. జీఎస్ డబ్ల్యూ అధికారులు, సిబ్బంది అత్యుత్సాహంతో కలెక్టర్ కోసం ఒకటి.. ఇతరుల మరొకటి అంటూ రెండు లైన్లలో పంపడంతో కాసేపు గందరగోళం ఏర్పడింది. ఈ విషయం తెలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహించడంతో ఒక లైనులోనే అనుమతించారు.

తోతాపురికి గిట్టుబాటు ధర కల్పించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామానాయుడు, రైతు సంఘ నాయకులు

మామిడిలో ఎక్కువగా తోతాపురి రకం అధిక దిగుబడి వస్తుందని, గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్న రైతులకు న్యాయం చేయాలని మామిడి ధరల స్థిరీకరణ కమిటీ నాయకులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. తోతాపురి రకానికి సరైన ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ రకం మామిడిని పండించడానికి టన్నుకు రూ.15వేలు నుంచి రూ.20వేలు వరకు ఖర్చవుతోందని చెప్పారు. కాబట్టి టన్నుకు రూ.30వేలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మామిడి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. టేబుల్ వెరైటీలను రైతు బజారులో ప్రభుత్వం ద్వారా విక్రయించి కనీస ధర ఉండేలా చూడాలన్నారు. మామిడి పల్ప్‌ను దేవాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామానాయుడు, గోపాల్‌రెడ్డి, హేమలత, వెంకయ్య, పద్మనాభం, అయ్యప్పనాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత మా భూమి ఆక్రమించారు

మా పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిని గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేత సురేష్‌రెడ్డి ఆక్రమించాడు. అందుకు రెవెన్యూ వాళ్లు సహకరించారు. ప్రభుత్వం మారింది. మా భూమిని మాకు ఇప్పించి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి.

- మహేష్, అలిమిలి గ్రామం

శ్మశాన వాటికను ఏర్పాటు చేయండి



తిరుపతి అర్బన్ తిమ్మినాయుడు పాలెం హరిజనవాడలో 4 వేలు కుటుంబాలకు శ్మశాన వాటిక లేక ఇబ్బందిగా ఉందని ఏపీ అంబేడ్కర్ యువజనసంఘం నేత వెంకటరత్నం అన్నారు. 2018లో గ్రామానికి ఉత్తరం వైపున నిరుపయోగంగా ఉన్న అటవీ శాఖ భూమిని కేటాయించాలని అప్పటి జిల్లా అధికారులు ఆదేశించారన్నారు. ఇప్పటికీ శ్మశాన వాటిక కోసం స్థలం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు.

ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



తిరుపతి అర్బన్ మండలం వేణుగోపాల్ కాలనీలో వారం కిందట ఇళ్లను కూల్చివేసిన వారిపై కఠిన కేసులు నమోదుచేసి బాధితులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఆర్‌పీఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు అంజయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద బాధితులతో కలిసి సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ ఘటనలో ప్రమేయమున్న రాజన్‌బాబు, నిర్మల, రమణారెడ్డి, చంద్రగిరి మస్తాన్, మునిరెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కోర్టు వివాదం ఉన్న స్థలాలను మోసం చేసి అమ్మిన రుద్రగోపి, శ్రీనివాసరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వేణుగోపాల్, కార్యదర్శి వర్గ సభ్యులు మాధవ, బుజ్జి, బాధితులు వెంకటేష్, శ్రీరాములునాయక్, రిషిరెడ్డి, శివమణి, వెంకటేష్, పద్మావతి, కాంచన తదితరులు పాల్గొన్నారు.

మాపై అక్రమకేసులు

బాలయ్యపల్లి మండలం సరిహద్దు, వెంకటగిరి మండలం సరిహద్దు వద్ద మర్థనపల్లెలో పూర్వీకుల నుంచి మా అధీనంలో భూములను సాగుచేసుకుంటున్నారు. శ్రీకాళహస్తికి చెందిన కొంతమంది ఆ భూమికి కంచె వేస్తుంటే అడ్డుకున్నాం. మాపై అకారణంగా ఎస్ఐ సహకారంతో అట్రాసిటీ కేసు పెట్టి వేధిస్తున్నారు. సంబంధం లేని వ్యక్తుల ద్వారా తప్పుడు కేసులు బనాయించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి.

- వెంకటేశ్వర్లు. అక్కసముద్రం, బాలయపల్లి

ఉపాధి కల్పించండి



సారూ.. మాకు ఏడేళ్ల కిందట వివాహమైంది. నేను, నాభర్త దివ్యాంగులం. మాకు ప్రభుత్వం తరపున దివ్యాంగుల కోటలో జీవనోపాధి కల్పించి ఆదుకోవాలి. పూట గడవడానికికూడా కష్టంగా ఉంది.

- మయూరి, ప్రదీప్, పేరూరు, తిరపతి రూరల్ మండలం

ప్రభుత్వ భూములు విక్రయిస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి రూరల్ మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ మాధవరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన డీటీ రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చేతులు కలిపి భూఆక్రమణలకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

ఆదుకుంటామని చేతులెత్తేశారు



ఇటీవల ఏర్పేడు మండలం వికృతమాల సమీపంలోని ఓ కంపెనీలో భవన నిర్మాణం పనిచేస్తుండగా కటింగ్ మిషన్‌తో కాలు తెగిపోయింది. ఆస్పత్రిలో చికిత్స పొంది కూలీపనులకు వెళ్లలేక ఇంటికే పరిమితమయ్యా. అప్పుడు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కంపెనీ నిర్వాహకులు ఇప్పుడు పట్టించుకోవడంలేదు. నాకు న్యాయం చేయండి.

- విజయకుమార్, మేస్త్రీ, రేణిగుంట

పోలీసుల అదుపులో ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ల చోరీల ముఠా
● ఎనిమిది మంది నిందితుల అరెస్టు


మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఏర్పేడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో గత ఏడాది నుంచి రైతుల పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మలర్లు, మోటర్లు, స్టార్టర్లు, కేబుల్‌వైర్లు చోరీ చేసే ముఠాను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్లలో రాగి వైరు, బోరులో కేబుళ్ల చోరీపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరుస కథనాలు రావడంతో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, గాజులమండ్యం ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు. ఏర్పేడు, గాజులమండ్యం పోలీసులు ఏర్పేడు మండలంలోని వికృతమాల సమీపంలో ఉన్న టీసీఎల్ పరిశ్రమ వద్ద సోమవారం తెల్లవారజామున ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాళహస్తి మండలం ఎర్రగుడిపాడుకు చెందిన వెంకట్రామయ్య, కత్తి మణి, జండా వెంకటేష్‌ను స్టేషన్‌కు తరలించారు. వారు చోరీ చేసిన రాగివైరు, బోరు కేబుళ్లను కొనుగోలు చేసిన తిరుపతికి చెందిన ఎస్కే ఖాదర్‌బాషా, సయ్యద్, హుస్సేన్, షేక్ బషీద్‌తో పాటు శ్రీకాళహస్తికి చెందిన షేక ఉస్మాన్, వెంకటగిరికి చెందిన గోపాలకృష్ణను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో ఏర్పేడు పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో మీడిమా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎనిమిది మంది నిందితుల నుంచి 795 కిలోల రాగివైర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

సత్యసాయి జిల్లాకు శివప్రసాద్
● నాన్ ఫోకల్ పోస్టు ఇవ్వాలని ఉత్తర్వు

తిరుపతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సర్కారులో రేణిగుంట, కడప రూరల్ తహసీల్దార్‌గా పనిచేస్తూ అవినీతి ఆరోపణలతో సస్పెండైన సిద్దాల శివప్రసాద్‌ను సత్యసాయి జిల్లాకు కేటాయిస్తూ సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కడప రూరల్ తహసీల్దార్‌గా ఉన్న సమయంలో గత ఏడాది ఏప్రిల్ 8న ఏసీబీకి చిక్కి సస్పెండయ్యారు. సస్పెండైన ప్రభుత్వ ఉద్యోగికి ఏడాది తర్వాత పోస్టింగ్ ఇవ్వాలన్న నిబంధన మేరకు సదరు అధికారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని గత నెల 18న సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. సస్పెన్షన్‌ను రీవోక్ చేస్తూ పోస్టింగ్ ఇవ్వాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చాయి. అయితే తిరుపతి అర్బన్ తహసీల్దారుగా కూర్చోవాలని రాజకీయ నాయకులతో ఈయన అధికారులపై ఒత్తిడి చేయించినట్టు ప్రచారం జరిగింది. ఈ క్రమంలో ఇతడి వ్యవహార శైలి, వివాదాస్పద పనితీరు తెలిసి అతడ్ని తహసీల్దార్ల కొరత ఉన్న సత్యసాయి జిల్లాకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను సవరించింది. అదికూడా నాన్ ఫోకల్ పోస్టులో వేయాలని ఆ జిల్లా కలెక్టర్‌కు సూచిస్తూ, తిరుపతి జిల్లా నుంచి వెంటనే రిలీవ్ చేయయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
వైభవంగా ధ్వజారోహణం


పెద్దశేష వాహనంలో ఉత్సవర్లు

తిరుపతి అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉత్సవర్లు, ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు నాలుగు మాడవీధుల్లో ఊరేగారు. ఆలయానికి వేంచేపుచేసి విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణలు నడమ ఉదయం 7.02-7.20గంటల మధ్య మిథున లగ్నంలో గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. అనంతరం స్వామివార్లకు ఆస్థానం, స్నపన తిరుమంజనం కావించారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి పెద్దశేష వాహనంలో స్వామివారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. జియ్యంగార్లు, అధికారులు పాల్గొన్నారు.





నేడు సీనియర్ పురుషుల క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి(క్రీడలు), జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సీనియర్ మెన్స్ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు సీడీసీఏ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి రవి ఓ ప్రకటనలో తెలిపారు. వాల్మీకిపురం, తిరుపతి, చిత్తూరు, మదనపల్లె క్రికెట్ మైదానాల్లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామగ్రి, ఆధార్ తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000214966, 8886185559లను సంప్రదించాలని కోరారు.

ఫెంగల్ తుఫానులో దెబ్బతిన్న చెరువులకు రూ.78.50 లక్షలు
● తిరుపతి, చిత్తూరు జిల్లాలకు మంజూరు

తిరుపతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గతేడాది ఫెంగల్ తుఫానులో దెబ్బతిన్న తిరుపతి, చిత్తూరు జిల్లాల చెరువులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 78.50 లక్షలు మంజూరు చేసింది. గతేడాది నవంబరు 30వ తేదీ నుంచి డిసెంబరు 2వ తేదీ నడుమ ఫెంగల్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఈ రెండు జిల్లాల్లో పలు మైనర్ ఇరిగేషన్ చెరువులు దెబ్బతిన్నాయి. వాటి తాత్కాలిక పునరుద్ధరణకు రూ. 9.54 కోట్ల నిధులు అవసరమని మైనర్ ఇరిగేషన్ విభాగం చీఫ్ ఇంజనీర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్ర విపత్తుల సహాయక నిధుల నుంచి రూ. 78.50 లక్షలు మంజూరు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు జిల్లాల్లో దెబ్బతిన్న చెరువులను తాత్కాలిక ప్రాతిపదికన పునరుద్ధరించడానికి రూ. 9.54 కోట్లు అవసరమవుతుందని ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించి పంపితే ఆరు నెలలు ఆలస్యంగా అది కూడా అరకొర నిధులు మంజూరు చేసింది. జనవరి నుంచీ మే దాకా పెద్దగా వర్షాలు కురిసే ఐదు నెలల పాటు పట్టించుకోకుండా తీరా నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే సమయంలో చెరువుల మరమ్మతులకు నిధులివ్వడం విమర్శలకు దారి తీస్తోంది. వర్షాలు కురిసే సమయంలో చెరువులకు మరమ్మతులు చేయడం ఇబ్బందికరమన్న అంశాన్ని ప్రభుత్వం విస్మరించడం గమనార్హం.

షార్టు సర్క్యూట్‌తో కారు దగ్ధం
● ఆరుగురు ప్రయాణికులు సురక్షితం



తిరుపతి(నేరవిభాగం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బ్యాటరీల్లో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. దీంతో కారు పూర్తిగా కాలిపోయిన సోమవారం తిరుపతిలో చోటు చేసుకుంది. తిరుపతి అగ్నిమాపక శాఖాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి కథనం మేరకు.. చెన్నైకు చెందిన ఎస్.ధర్మచంద్ కుటుంబ సమేతంగా.. మొత్తం ఆరుగురు కారులో (టీఎన్20బీడీ 6211) తిరుమలకు బయలుదేరారు. తిరుచానూరు రోడ్డులోని పిల్లర్ నెంబరు 28 వద్దకు కారు రాగానే బ్యాటరీలో విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. కారులోని ఆరుగురు హుటాహుటిన కిందకు దిగేయడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. తిరుపతి అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో దాదాపు రూ రెండు లక్షల ఆస్తి నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు
జరక్కుండా చర్యలు తీసుకోండి

● రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి



అధికారులతో సమావేశమైన సూర్యకుమారి, సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు జరక్కుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులతో సమీక్షించారు. చిత్తూరు నగర శివార్లలో లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు కలెక్టర్ గుర్తించి, వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిసిందన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు జిల్లాకు సరిహద్దు ప్రాంతం కావడంతో బాల్య వివాహాలు కట్టడి చేయడానికి ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మేనరికం వివాహాలతో జరిగే అనర్థాలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వివరించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు నివేదిక పంపాలని కోరారు. ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, డీఎంహెచ్‌వో సుధారాణి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ చెన్నయ్య, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, మహిళా పోలీసు ఎస్‌ఐ నాగసౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రీ దుర్మరణం


గోపి (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ తాపీ మేస్త్రీ దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె గ్రామ పంచాయతీ వేపేరి గ్రామానికి చెందిన ఎం.నాగూర్ శెట్టి కుమారుడు ఎం.గోపి(25) తాపీ మేస్త్రీ. సోమవారం సాయంత్రం వెదురుకుప్పం వైపు నుంచి స్వగ్రామానికి బైక్‌లో వెళుతుండగా ఇదే మండలంలోని పాత గుంట వద్ద పెనుమూరు వైపు నుంచి పుత్తూరుకు వెళుతున్న పుత్తూరు ఆర్టీసీ డిపో బస్సు, బైక్ ఢీకొన్నాయి. గోపి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతునికి ఇంకా వివాహం కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఉద్యోగుల బదిలీలకు గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును ప్రభుత్వం ఈనెల తొమ్మిదో తేదీవరకు పొడిగించింది. మే 15వ తేదీన ప్రకటించిన షెడ్యూలు ప్రకారం అన్ని శాఖల్లో బదిలీల గడువు సోమవారంతో ముగియాలి. పింఛన్ల పంపిణీ, యోగాంధ్ర-2025 కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్న కారణంగా ఇందులో పాల్గొంటున్న ఉద్యోగులను బదిలీల పేరిట డిస్టర్బ్ చేయకూడదని ప్రభుత్వం భావించింది. మరికొన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తికాలేదు. దాంతో బదిలీల గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ


ఆలయంలో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 589మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,913, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,105 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,152మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,304, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 469, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 261, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 63మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,051 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

నాటుబాంబు తొక్కి గాయపడ్డ వేటగాడు



ఛిద్రమైన వినాయకం కాలు

బంగారుపాళ్యం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నాటుబాంబును ప్రమాదవశాత్తూ తొక్కడంతో అది పేలి.. ఓ వేటగాడు గాయపడ్డాడు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలంలోని పులిమడుగుకు చెందిన బాలకృష్ణ కుమారుడు వినాయకం అటవీ జంతువులను వేటాడటానికి తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం నుంచి నాటుబాంబులు తీసుకొచ్చేవాడు. ఇలా తీసుకొచ్చిన వాటిని తన ఇంటి ప్రాంగణంలోని పూలచెట్లలో భద్రపరిచేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం పూలచెట్ల పరిసరాల్లో కుక్క తచ్చాడుతుండగా గమనించాడు. దాన్ని తరమడానికెళ్లి ప్రమాదవశాత్తూ అక్కడున్న నాటుబాంబును తొక్కడంతో అది పేలింది. కుడికాలు పూర్తిగా ఛిద్రమైంది. స్థానికులు అతడిని తొలుత బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత మెరుగైన వైద్య నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీఆర్వో హేమచంద్ర ఇచ్చిన ఫిర్యాదుతో వినాయకంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : నలుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం) జూన్ 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నలుగురు నిందితులను ఈస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. తెలంగాణా రాష్ట్రం సిద్దిపేటకు చెందిన వల్లపు నవీన్, మల్కాజ్‌గిరికి చెందిన శివకుమార్ కర్ణాటక బ్రాండు మద్యం తక్కువ ధరకు తెప్పించుకుని ఇక్కడ విక్రయాలు చేస్తున్నారు. సోమవారం తిరుపతి-తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణమ్మ ఆలయం వద్ద మద్యం విక్రయిస్తున్నట్లు ఈస్ట్ సీఐ శ్రీనివాసులుకు సమాచారం వచ్చింది. ఎస్‌ఐ రామాంజనేయులు సిబ్బందితో వెళ్లి వారిని అరెస్టు చేసి 20 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రైల్వే స్టేషన్ వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న చిత్తూరు జిల్లా పెద్దపంజాణికి చెందిన గడ్డి సుబ్రహ్మణ్యం, పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన మేకల అజయ్‌కుమార్‌లను అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేశారు.

వాహనం సహా ఎర్రచందనం దుంగల స్వాధీనం


వాహనం, ఎర్రచందనం దుంగలను చూపుతున్న అధికారులు

రేణిగుంట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు టీఎస్ పాళ్యం ఎఫ్ఎస్ఓ చైతన్య తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి రేణిగుంట మండలంలోని కోడూరు - రేణిగుంట మార్గంలో శ్రీనివాసపురం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ క్రమం లో కోడూరు నుంచి రేణిగుంట వైపు వస్తున్న కారులోని డ్రైవర్ తనిఖీలను గమనించి వాహనాన్ని ఆపి అడవిలోకి పారిపోయాడన్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా 9 ఎర్రచందనం దుంగలున్నట్టు గుర్తించామన్నారు. వాహనం సహా దుంగలను అటవీశాఖ కార్యాలయానికి తరలించామని వాటి విలువ రూ.8 లక్షలు ఉంటుందన్నారు.

ఆలకించి.. ఆదరించండి

● కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్ఎస్'లో బాధితుల మొర


బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, డీర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ రకాల సమస్యలపై 275 మంది బాధితులు హాజరయ్యారు. రెవెన్యూశాఖకు 219, పోలీసుశాఖకు 14, పంచాయతీరాజ్‌కు 1, డీఆర్‌డీఏకు 22, ఏపీఎస్పీడీసీఎల్‌కు 4, జిల్లా రిజిస్ట్రార్‌కు 1, డీఎస్వోకు8, పశు సంవర్ధకశాఖకు 1, మున్సిపాలిటీకి 1, డీఎంహెచ్‌వోకు 1, రూరల్ వాటర్ స్కీమ్‌కు 3 చొప్పున వినతిపత్రాలు అందాయి. బాధితుల సమస్యలు విని పరిష్కారానికి చర్యలు తీసుకుటామని అధికారులు హామీ ఇచ్చారు.

వచ్చిన వినతుల్లో కొన్ని..

● అపోలో ఆస్పత్రిలో వైద్యులు రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గుడిపాల మండలం 190 రామాపురానికి చెందిన రామరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గత శుక్రవారం తన కూతురు వైశాలి(10) ట్రాక్టర్‌పై నుంచి పడడంతో చెయ్యి విరిగిందని, వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్తే డాక్టర్లు కనీసం బిడ్డను గంట వరకు చూడలేదన్నారు. నిర్లక్ష్యంగా వ్యహరించిన అపోలో డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

● మాజీ సైనికోద్యోగి భూ కబ్జాలపై విచారణ చేసి న్యాయం చేయాలని జీడీ నెల్లూరు మండలం కొండేపల్లె గ్రామస్తులు కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఆర్మీలో పనిచేసి రిటైర్డ్ అయిన సామివేలుకు కొండేపల్లె వద్ద ఐదు ఎకరాల భూమిని ఇచ్చారన్నారు. అతని భూమి పక్కన ఉన్న ఇతరుల అనుభవంలో ఉన్న భూములను సామివేలు భార్య ప్రియాంక, వారి బంధువులు భూపతి, దేవరాజులు ఆక్రమించుకున్నారని వాపోయారు. మామిడి, టెంకాయ, ఇతర మొక్కలను పీకేసి తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని వివరించారు.


నిరసన దీక్ష చేస్తున్న వెంకటాచలం నాయుడు

● మామిడికి గిట్టుబాటు ధరను కల్పించాలని రైతు ఉద్యమ నేత ఈదల వెంకటాచలం నాయుడు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద మామిడి రైతులకు మద్దతుగా నిరసన దీక్ష చేపట్టారు. తోతాపురి రకం(టన్ను)కు రూ. 50వేలు, బేనీషాకు రూ.70వేలు, నీలం రకానికి రూ. 90వేలు మద్దతు ఇవ్వాలని కోరారు.

● గుడిపాల మండలం చామంతిపురంలో కనీస సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. చౌక దుకాణం రెండు కిలో మీటర్ల దూరంలో ఉండటంతో సరుకులు తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం, బస్సు ఏర్పాటు చేయాలని కోరారు.


జీడీ నెల్లూరు మండలం కొండేపల్లె గ్రామస్తులు


గుడిపాల మండలం చామంతిపురం వాసులు

జిల్లా పోలీసు కార్యాలయంలో..


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

● జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మణికంఠ, ఏఎస్పీ రాజశేఖర్ రాజు వినతిపత్రాలను స్వీకరించారు. బాధితుల వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్పీ దృష్టికి వచ్చిన అర్జీల వివరాలు.. భూ తగాదాలు 21, డబ్బు తగాదాలు 11, కుటుంబ తగాదాలు 6, ఇంటి తగాదాలు 5, ఆస్తి తగాదాలు 4, బైక్ చోరీ 2, వేధింపులు 2, చీటింగ్ 1, దారి సమస్యలు 1 చొప్పున ఉన్నాయి.

పారదర్శకంగా టీచర్ల పదోన్నతి, బదిలీలు: ఆర్జేడీ


ఎంఈవోలకు సూచనలు ఇస్తున్న ఆర్జేడీ శామ్యూల్

చిత్తూరు సెంట్రల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): టీచర్ల పదోన్నతి, బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ కడప ఆర్జేడీ శామ్యూల్ స్పష్టం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జరుగుతున్న టీచర్ల బదిలీలు, పదోన్నతులు, నాన్ టీచింగ్ స్టాఫ్ బదిలీల ప్రక్రియ పరిశీలన నిమిత్తం సోమవారం జిల్లాకు వచ్చారు. తొలుత డీఈవో వరలక్ష్మితో పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం ఎంఈవోలతో సమావేశం నిర్వహించిన ఆయన స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలు లెక్కలు తేల్చాలని సూచించారు. త్వరలో ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతులు నిర్వహించనున్న నేపథ్యంలో ఎక్కడా పొరబాట్లు లేకుండా అన్ని ఖాళీలు గుర్తించాలని సూచించారు.

టీచర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

బదిలీలు, పదోన్నతుల్లో వివిధ కారణాలతో నష్టపోయిన టీచర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్జేడీ భరోసా ఇచ్చారు. ఆయా అంశాలను విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. యూటీఎఫ్ నేతలు రమణ, మణిగండన్ తదితరులు ఆర్జేడీని కలిసి పలు సమస్యలు ప్రస్తావించారు. టీటీడీ ఉద్యోగులు స్పౌజ్ వారికి పాయింట్లు వర్తింప చేయాలని, తొట్టంబేడు మండలం రామచంద్రాపురం ప్రభుత్వ పాఠశాల యాజమాన్యం మార్పును సవరించాలని, నిబంధనలకు విరుద్ధంగా పాయింట్లు పొందిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని, సాంకేతిక సమస్యలతో పాయింట్లు నష్టపోయిన వారికి న్యాయం చేయాలని కోరారు. సంఘం నేతలు సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్ప, దక్షిణామూర్తి, శేఖర్, మహేష్, వాసు, తదితరులున్నారు.

మోడల్ స్కూల్ హెచ్‌ఎంల జాబితా ఖరారు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 950 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఉండగా, 600 చోట్ల హెచ్‌ఎంల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల కోసం వెయ్యిమంది విల్లింగ్ ఇవ్వగా, సోమవారం 358 మందితో జాబితా ఖరారైంది. వీరిలో 288 మందికి ఆర్డర్స్ వచ్చాయి. మిగిలిన వారికి రావాల్సి ఉంది.

మామిడికి గిట్టుబాటు ధర ఇవ్వండి

- రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్


మామిడి కాయలను పరిశీలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి తదితరులు

బంగారుపాళ్యం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మామిడికి గిట్టుబాటు ధర ఇచ్చి, రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మామిడి రైతులు, రైతు సంఘ జిల్లా కార్యదర్శి శంకరన్‌తో కలిసి బంగారుపాళ్యం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం నాటికి మార్కెట్‌లో తోతాపురి రూ.4-5 మధ్య కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వ రైతులకు కనీస ధర రూ.25గా నిర్ణయించి, మార్కెట్ యార్డుల్లో ధరల పట్టిక ఏర్పాటు చేయాలని కోరారు. వీరివెంట రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు గంగరాజు, నాయకులు సుబ్రహ్మణ్యం, లోకేశ్, రాజన్న తదితరులున్నారు.

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో మామిడి గుజ్జు పరిశ్రమలు.. రైతుల నుంచి కాయలు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడానికి చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలో మామిడి బోర్డు ఏర్పాటుకు తన వంతు కృషిచేస్తానని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో కలెక్టర్ సుమిత్ కుమార్ మామిడి రైతుల శ్రేయస్సుకోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఇటీవలే కలెక్టర్ చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, మామిడి గుజ్జుపరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించారని గుర్తుచేశారు.

హ్యాండ్ బ్రేక్ లాగడంతో బోల్తా పడ్డ కారు

● సురక్షితంగా బయటపడ్డ కుటుంబ సభ్యులు



పిచ్చాటూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కీళపూడి వద్ద సోమవారం సాయంత్రం చెన్నై నుంచి నగరికి వెళుతున్న కారు బోల్తా పడింది. అయితే అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. నగరి మండలం చింతలపట్టెడవాసులు బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా కీళపూడి వద్ద కారులో ప్రయాణిస్తున్న బాలుడు హ్యాండ్ బ్రేక్ లాగాడు. దీంతో కారు బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో కారు డ్రైవర్‌ని మందలించారు. డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించి పంపించారు.

మహిళ మెడలో సరుడు అపహరణ

నాయుడుపేట టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో నుంచి మూడు సవర్ల సరుడును గుర్తు తెలియని యువకుడు లాక్కెళ్లాడు. తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని కొత్త బీడీ కాలనీలో నివాసం ఉంటున్న చంద్రమ్మ ఆదివారం సాయంత్రం గ్రీన్‌సిటీ సమీపంలో వాకింగ్ చేస్తుండగా మోటారు సైకిల్‌పై వచ్చిన గుర్తుతెలియని యువకుడు చంద్రమ్మ మెడలో సరుడును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాయుడుపేట - ఎల్‌ఏ సాగరం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సోమవారం రాత్రి జాతీయ రహదారి సమీపంలో వాహనం ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఎరుపు, నలుపు, తెలుపు, గడుల చొక్కా ధరించి ఉన్నాడు. సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

హత్యాయత్నం కేసు నమోదు

కోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా కోట పట్టణ పరిధిలోని అంబేడ్కర్ గురుకులం సమీపంలో కుదురు రమణయ్యపై హత్యాయత్నం జరిగినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. రమణయ్య కోట బజారుసెంటర్ నుంచి తాను నివాసం ఉంటున్న కోటమ్మగుడి కాలనీకి మోటరు బైక్‌లో వెళ్తుండగా గురుకులం క్వార్టర్స్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు కారం చల్లి హత్యాయత్నం చేయబోయారని, కేకలు వేయడంతో నిందితులు పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సదరన్ డిస్కం ఫైనాన్స్ సీజీఎం
బాధ్యతల స్వీకరణ


రామ్మోహనరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 2(ఆటోనగర్): సదరన్ డిస్కం ఫైనాన్స్ సీజీఎంగా కె.రామ్మోహనరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సంస్థకు ఆర్థిక శాఖ కీలకమైందన్నారు. పదవికి న్యాయం చేసేలా పనిచేస్తానన్నారు. అనంతరం పలువురు అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో మురళికుమార్, సురేంద్రరావు, శ్రీకాంత్, మధుసూదన్, ప్రశాంతి, శైలజ, పుల్లా బాలాజీ, వినకోటి చంద్రశేఖరరావు, ఆంజనేయులు, ముని ప్రసాద్, జయప్రకాష్, భాస్కర్‌నాయుడు, జీఎం నీలం నరేంద్రనాథ్, ఈఈ టెక్నికల్ వాసవీలత ఉన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● భర్త మృతి.. భార్య, అల్లుడి పరిస్థితి విషమం


వెంకటస్వామి (ఫైల్ ఫొటో) - గాయపడిన నారాయణమ్మ, వాసు

కల్లూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో భర్త మృతి చెందగా.. భార్య, అల్లుడి పరిస్థితి విషమంగా మారింది. కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. పులిచెర్ల మండలం 102 రామిరెడ్డిగారిపల్లె పంచాయతీ చిగరమాకులపల్లెకు చెందిన వెంకటస్వామి (70), నారాయణమ్మ దంపతులు ఆదివారం మండలంలోని పాతపేట పంచాయతీ పూరేడువాండ్లపల్లెలోని తమ కుమార్తె ఇంటికి వచ్చారు. సోమవారం ఉదయం అల్లుడు వాసు తన ద్విచక్రవాహనంపై అత్తమామలను ఎక్కించుకుని వారి స్వగ్రామంలో వదిలేందుకు బయల్దేరాడు. కల్లూరు సమీపంలోని జాతీయ రహదారిపై వెళుతుండగా వీరి వాహనాన్ని అరుణాచలం వెళ్లే కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వెంకటస్వామి మృతిచెందాడు. నారాయణమ్మ, వాసు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. వెంకటస్వామి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేయండి



కడా పీడీకి అర్జీలు సమర్పిస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలోని అర్హులైన వారందరికీ సామాజిక పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ కుప్పం మండలాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్‌ను కోరారు. కుప్పం మండల సచివాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా కడా పీడీని ప్రేమ్‌కుమార్ కలిశారు. తనతోపాటు తీసుకొచ్చిన పింఛన్ల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్న అర్జీలను ఆయనకు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో ఇంకా చాలామంది అర్హులకు పింఛన్లు రావాల్సి ఉందని.. వారికి మంజూరు చేయాలని విన్నవించారు. పీడీ వారికి సమాధానమిస్తూ పరిశీలించి మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంటదాకా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరిగింది. నియోజకవర్గంలోని పలువురు ప్రజలు, వివిధ సమస్యలపై కడా పీడీకి అర్జీలు సమర్పించారు. ఆయన వాటిని సంబంధిత అధికారులకు ఇచ్చి పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో కుప్పం మండల టీడీపీ పంచాయతీ అధ్యక్షులు, యూనిట్ ఇన్‌చార్జీలు, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కుప్పం చేరిన పాఠ్య పుస్తకాలు



పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

కుప్పం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లె రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలు సోమవారం కుప్పం చేరాయి. మండలంలోని ప్రాథమిక పాఠశాలలకు ఈ పాఠ్య పుస్తకాలను మండల విద్యాశాఖాధికారి-2 రాజారాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం మండలం, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బెల్టులు, నిఘంటువులు ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. 2025-2026 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తామని చెప్పారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తీసుకువెళ్లాలని సూచించారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కన్నన్

కుప్పం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం నాయనూరు పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన సెల్వరాజ్ అనారోగ్యంతో బాధపడుతూ కుప్పం పీఈఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి వెళ్లి మెరుగైన వైద్యం చేయించుకోవాలని వైద్యులు సిఫార్సు చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్ సోమవారం ఆసుపత్రికి వెళ్లారు. బాధితుడిని పరామర్శించారు. సెల్వరాజ్‌ను తిరుపతి తీసుకెళ్లడానికి అంబులెన్స్ ఖర్చుల కోసం ఆయన కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

అవసరం మేరకే పురుగుల మందులు వాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త పీరూసాహెబ్

గంగవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రైతులు అవసరం మేరకే పంటలకు పురుగుల మందులు వాడాలని ఏడీ శివకుమార్ సూచించారు. సోమవారం గంగవరం మండలం జీడిమాకులపల్లి గ్రామంలో ఖరీఫ్ పంటల సాగుపై రైతులకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త పీరూసాహెబ్ ఖరీఫ్‌లో పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఏడీ మాట్లాడుతూ రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు కొన్న తర్వాత తప్పని సరిగా రసీదులు పొందాలన్నారు. ఏవో హేమలత మాట్లాడుతూ పొలాల గట్లపై అల్లనేరేడు, చింత, ఎర్రచందనం మొక్కలు నాటుకోవాలంటే ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కలికిరి కేవీకే సమన్వయకర్త డాక్టర్ మంజుల పాల్గొన్నారు.


పేదలను ఆదుకోవడమే చంద్రబాబు ధ్యేయం



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ రామకుప్పం మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల పరిధిలోని ఆరుగురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి రూ.4.99 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకుని సంతోషకర జీవితాలను పొందాలని కోరారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, నేతలు రామ్మూర్తి, మనోహర్, కామరాజనాయక్, జయశంకర్, మహ్మద్‌రఫీ, వెంకటాచలం, పెరుమాళ్, శ్రీనాథరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, సుబ్రీ, ఆదిల్, భానుమూర్తి, నవీన్, నియాజ్, మునిరెడ్డి, సుబ్రహ్మణ్యం, అక్బర్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రధానం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, మే 2 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో కార్మికులు ఎట్టి పరిస్థితిలోనూ రాజీ పడరాదని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ రామకుప్పం మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి కోరారు. సోమవారం రామకుప్పంలో వంట కార్మికులకు నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం అందించడంపై మంత్రి నారా లోకేశ్ ఎంతో శ్రద్ధ చూపుతున్నారన్నారు. మధ్యాహ్న భోజనం తయారీ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నారాయణ, టీడీపీ నేతలు కామరాజనాయక్, గజేంద్ర, బీజేపీ నేతలు రాజసింహా, నాగరాజు, జనసేన నేత పవన్ పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, వెలుగు సిబ్బంది

చౌడేపల్లె, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీవో లీలామాధవి పేర్కొన్నారు. సోమవారం ఆమె యోగాంధ్రలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగా చేయడంతో పలు రోగాల నుంచి బయట పడుతారని.. బీపీ, షుగర్ వంటి వ్యాధులు దరిచేరవన్నారు. ఈనెల 9న బోయకొండలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాడిరైతులకు రాయితీపై దాణా



దాణా పంపిణీ చేస్తున్న రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాయితీ పశువుల దాణాను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక పశువైద్యశాలలో పాడిరైతులకు రాయితీ దాణాను పంపిణీ చేశారు. 50 శాతం రాయితీతో రూ.555 ధరతో బస్తా దాణాను ఇవ్వనున్నట్లు తెలిపారు. 135 బస్తాలు అందుబాటులో ఉన్నాయని.. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి, బాబునాయుడు, సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' పోస్టర్ల ఆవిష్కరణ

చౌడేపల్లె, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు దినం పోస్టర్లను వైసీపీ మండలాధ్యక్షుడు నాగభూషణరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బస్టాండులోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఎంపీపీ రామ్మూర్తి, జడ్పీటీసీ దామోదర్‌రాజు, వైస్ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మిద్దింటి కిశోర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సోమల: సోమలలో ఎంపీపీ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు మోహన్, నాగేశ్వరరావు, శ్రీరాములు, శివ, నరసింహలు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు: పుంగనూరులో బుధవారం నిర్వహించనున్న ర్యాలీ, నిరసన కార్యక్రమానికి అనుమతులు ఇవ్వాలని సీఐ సుబ్బరాయుడుకు మాజీ ఎంపీ రెడ్డెప్ప వినతి పత్రం అందించారు. మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి, షరీఫ్, రాజశేఖర్‌రెడ్డి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

జేసీబీ తీసిస్తామని మోసగించారు

చౌడేపల్లె, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేసీబీ తీసిస్తామని డబ్బులు తీసుకుని మోసగించారని ఓ మహిళ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని గోసలకురప్పల్లెకు చెందిన శ్రీదేవి తనకున్న జేసీబీని అమ్మేసి కొంత అప్పులు చెల్లించేసింది. మరో సెకండ్ హ్యాండ్ బండి తీసుకోవడానికి ప్రయత్నించింది. ఈ క్రమంలో చౌడేపల్లెకు చెందిన ఓ వ్యక్తి, చిత్తూరు, అరగొండకు చెందిన ముగ్గురు కలిసి జేసీబీ తీసిస్తామని రెండు నెలల క్రితం ఆమె వద్ద నుంచి రూ. 50 వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. అయితే తీసివ్వకుండా.. డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆమె చిత్తూరు పోలీస్ గ్రీవెన్స్‌లో, చౌడేపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ద్విచక్రవాహనానికి నిప్పు



సదుం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనానికి నిప్పు పెట్టిన సంఘటన సదుంలో సోమవారం ఉదయం వెలుగు చూసింది. బాధితుడు కథనం మేరకు... స్థానిక ఎగువ జాండ్రపేట నివాసి సలీం కుమారుడు అస్లాం పండ్ల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవలే 10 టన్నుల పుచ్చకాయలు తన ఇంటి సమీపంలో నిల్వ చేశారు. వాటితో పాటు ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో తన ద్విచక్రవాహనాన్ని కాయల వద్ద పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి సమయంలో తన ద్విచక్రవాహనానికి నిప్పు అంటుకోవడం గుర్తించి అదుపు చేశాడు. పాత కక్షలతో ఈ సంఘటనకు పాల్పడినట్లు బాధితుడు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

సోమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని పలువురు రైతులు తహసీల్దార్ బెన్నురాజ్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మామిడి రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ మండలంలో మామిడి వేలాది ఎకరాల్లో సాగులో ఉందని.. గిట్టుబాటు ధరలు లేవన్నారు. గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతున్నారు.

మార్కెట్ యార్డులో నిర్మాణ పనులు పూర్తయ్యేనా..!

- ప్రైవేటు స్థలాల్లో మండీల ఏర్పాటు
- సోమల నుంచి ఇతర రాష్ట్రాలకు భారీగా మామిడి ఎగుమతులు
- పనుల ఆలస్యంతో ఆందోళనలో రైతులు
- 30 ఏళ్లుగా అద్దె గదిలోనే ఏఎంసీ కార్యాలయం
- పట్టించుకోని అధికారులు, నాయకులు



సోమలలో జరుగుతున్న యార్డు పనులు



ప్రైవేటు స్థలాల్లో మామిడి కొనుగోలు కేంద్రాలు

సోమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మామిడి సీజన్ ప్రారంభంతో వ్యాపారులు ప్రైవేటు స్థలాల్లో మండీలు ఏర్పాటు చేసుకుని కొనుగోలుకు శ్రీకారం చుట్టారు. ఏఎంసీ యార్డు నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం రూ.4 కోట్లు మంజూరు కాగా అప్పటి నుంచి పనులు ప్రారంభించారు. సోమల మండల కేంద్రంలో 1994లో వ్యవసాయ మార్కెట్ కమిటీ అప్పటి పీలేరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో సదుం, సోమల మండలాలకు సంయుక్తంగా ఏర్పాటైంది. 30 ఏళ్లుగా సోమల సింగిల్ విండో కార్యాలయంలోనే అద్దె గదిలో ఏసీఎం పరిపాలన కొనసాగుతుంది. సోమల-కందూరు మార్గంలోని పుల్లయ్యతాత కుంట వద్ద ప్రభుత్వ, ప్రైవేటు స్థలంలో నిర్మాణ పనులు చేపట్టారు. ఇక్కడే రెండేళ్ల క్రిత ం రూ.60 లక్షలతో నియోజకవర్గ స్థాయిలో సైన్స్ ల్యాబ్‌కు శ్రీకారం చుట్టారు. ఆ పనులు సైత నత్తను తలపిస్తున్నాయి. సోమల మండలంలో 12 వేల ఎకరాలకు మించి మామిడి సాగు చేస్తున్నారు రైతుల శ్రేయస్సు కోసం నిధులు మంజూరు చేసినా గుత్తేదారు నిర్మాణ పనులు తీవ్ర జాప్యం చేయడంతో మామిడి మండీదారులు ప్రైవేటు స్థలాల్లో భూములు లీజుకు తీసుకొని షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు.

ఇక్కడ మామిడి కాయలు కొనుగోలు చేసి మహారాష్ట్ర, ముంబై, ఢిల్లీ, పూణె, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడి కూలీలే సోమలకు చేరుకుని మామిడి కాయలను గ్రేడింగ్ చేస్తున్నారు. టమోటా 3 వేల ఎకరాల్లో సాగులో ఉంది. రైతులు పండించిన టమోటా పంటను పలమనేరు, మదనపల్లె, కలికిరి, కలకడ, తిరుపతి, పుంగనూరు ప్రాంతాలకు తరలించి అమ్మకాలు చేయాల్సి వస్తోంది. సోమల మండలం నుంచి నిత్యం 20 లారీల టమోటాలు ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది. యార్డు నిర్మాణాలు పూర్తి చేస్తే సోమల మార్కెట్‌కు ఆదాయం సమకూరుతుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే పనులు పూర్తి కాకుండానే అప్పటి మంత్రి పెద్దిరెడ్డి హంటాహంటిన యార్డును ప్రారంభించారు. ఏడాది కావస్తున్నా యార్డులో పనులు సాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్ కమిటీకి నూతన చైర్మన్‌గా ఇరికిపెంట మాజీ సర్పంచ్ శ్రీనివాసులు నాయుడును నియమించారు. నూతన కమిటీ సభ్యులు, అధికారులు స్పందించి పనులు వేగవంతంగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



అద్దె గదిలో నడుస్తున్న ఏఎంసీ కార్యాలయం



మండీల నుంచి మామిడి కాయలు తీసుకెళుతున్న లారీలు

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో నారాయణ

సోమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో నారాయణ కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ యోగా డేను పురస్కరించుకొని చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. యోగా డేను ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు, రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శివరత్న, పీడీలు కరుణానిధి, చిన్నప్ప, ఏపీవో షౌకత్, ఏంపీఎం శివ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



ఆరడిగుంట టీడీపీ అధ్యక్షుడిని అభినందిస్తున్న మాధవరెడ్డి

పుంగనూరు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఆరడిగుంట పంచాయతీలో టీడీపీ నూతన అధ్యక్షుడిగా రెడ్డెప్పను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో రానున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న జగదీష్‌రాజు

పుంగనూరు రూరల్, జూన్ 2 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ప్రైవేటు బస్టాండ్‌లోని ఓ హోటల్‌లో దాత శివయ్య అందించిన నోటు పుస్తకాలను బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీష్‌రాజు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నానబాల కుమార్, పెద్దమఠం బాబు, ప్రసాద్, ఉమాశంకర్, వెంటేశ్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

పుంగనూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ రాముకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలంటే ఇసుక, సిమెంట్, కమ్మీ ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆక్రమణలో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు మున్నా, రామమూర్తి, శ్రీనివాసులు, శోభారాణి, ఉష, అఫ్రోజ్, సోఫియా, రమణ, ఆశ పాల్గొన్నారు.

రేపటి నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ

వి.కోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండల పరిధిలో ఈనెల 4న బుధవారం నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ చేస్తున్నట్లు ఏవో రాజ్యలక్ష్మి తెలిపారు. 30 కిలోల పూర్తి బస్తా ధర రూ.2,790 కాగా, రాయితీ పోను రూ.1674 చెల్లించి రైతులు తీసుకోవాలన్నారు. ఒక్కో రైతుకు బస్తా మాత్రమే పంపిణీ చేస్తారన్నారు. 4న బైరుపల్లె, బోడిగుట్టపల్లె, చింతమాకులపల్లె, గోనుమాకులపల్లె, కుంబార్లపల్లె, మద్దిమాకులపల్లె, ముదరండొడ్డి, పడిగలకుప్పం, పెద్దబరిణేపల్లె, పాముగానిపల్లె, తోటకనుమ, 5న కొంగాటం, నెర్నపల్లె, బోయచిన్నాగనపల్లె, సుద్దులకుప్పం, యాలకల్లు, 6న జవ్వునిపల్లె, పత్రపల్లె, శివునికుప్పం, వి.కోట, ఓగు 9న కృష్ణాపురం రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు పంపిణీ జరుగుతుందని తెలిపారు.

మహిళపై దాడి

పుంగనూరు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):పట్టణ సమీపంలోని నక్కబండలో కాపురం ఉన్న మదార్‌సాహెబ్ భార్య అజంబీ (50) వీధిలోని ఇంటి ముందు వేసిన బండలపై కూర్చొని ఉండటంతో పక్క ఇంటికి చెందిన సుబేదార్, అక్రమ్, అజగర్, అజ్మీర్, రామజ, అన్సర్‌లు దాడి చేసి గాయపరిచారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైభవంగా గంగమ్మ ఆలయ కుంభాభిషేకం



రామకుప్పం, మే 2 (ఆంధ్రజ్యోతి):రామకుప్పం మండలం సగినేకుప్పం గ్రామంలో ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయం జీర్ణోద్ధరణ, కొత్త విమానగోపుర ప్రతిష్ఠ, కుంభాభిషేక కార్యక్రమాలు గత మూడు రోజులుగా వైభవంగా జరిగాయి. చివరి రోజైన సోమవారం వేద పండితులు ఉదయం అమ్మవారి మూలమూర్తి మహాప్రాణ ప్రతిష్ఠ, ధేను, దీప, దర్పణ దర్శనం, మహాబలి, నాడీసంధానం, షోడశన్యాస, తత్వన్యాస, కళా, మూర్తి, ప్రతిష్ఠాంగ హోమాలు నిర్వహించారు. కుంభాభిషేకం, మహామంగళ హారతి కార్యక్రమాలు చేపట్టారు. టీడీపీ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

భారతంమిట్టలో కురుపాండవ జననం

సోమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం భారతంమిట్టలో సోమవారం కర్ణజననం సందర్భంగా భాగవతారణి నాగరత్న కథను వివరించి భక్తులను ఆకట్టుకున్నారు. రాత్రి పీలేరు వేంకటేశ్వర నాటక మండలి కళాకారులు కర్ణ జననంలోని ముఖ్య ఘట్టాలను ప్రదర్శించారు. ఉభయదారులు అబ్బన్నగారి వెంకటప్ప కుటుంబ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా పెద్దపులి గంగమాంబ జాతర



పెద్దపులి గంగమాంబకు పూజలు

వి.కోట, జూన్ 2 (ఆంధ్ర జ్యోతి): వి.కోటలో వెలసిన పెద్దపులి గంగమాంబ 63 జాతరకు పట్టణం ముస్తాబైంది. అత్యంత వైభవంగా నిర్వహించే జాతరకు ఆలయ కమిటీ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. ఆలయం వద్ద భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలను సమకూర్చుతున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలంకరణతో పాటు ప్రత్యేక పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ సోమశేఖర్ రెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి అమ్మవారి శిరస్సు, పూల గెరిగను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.

నగిరీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు




నగిరీశ్వరస్వామి ఆలయం వద్ద పూజలకు హాజరైన భక్తులు

ఆధ్యాత్మికం

వి.కోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వి.కోట సత్యసాయి నగర్‌లో వెలసిన నగిరీశ్వర స్వామి కి స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం స్వామివారి ఆలయం వద్ద అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు చేపట్టారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి



పుంగనూరు రూరల్, జూన్ 2 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి సోమవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఉదయాన్నే స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



విద్యార్థులు వేసిన చిత్రాలతో గ్రంథాలయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు జవహర్‌లు

బంగారుపాళ్యం, జూన్2 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణలో భాగంగా బంగారుపాళ్యం గ్రంథాల యం ఆధ్వర్యంలో నెల రోజుల పాటు విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణా తరగతులు నిర్వహిం చారు. చివరి రోజైన సోమవారం విద్యార్థులకు వృక్షోరక్షతి- రక్షితః అనే అంశంపై పోటీలు నిర్వ హించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు జవహర్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో శింగనమల ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), జూన్ 2(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడిని అనంతరపురం జిల్లా శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారుశ్రావణి సోమవారం దర్శించుకున్నారు. ఆమెను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామివారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో పండితులు ఆమెను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించండి

పాలసముద్రం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ అరుణకుమారి రెవెన్యూ సిబ్బందికి సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాలు, రెవెన్యూ కార్యాలయాల్లో వచ్చిన అర్జీలను పరిశీలించి వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు. రీ సర్వే సందర్భంగా రైతు ఖాతాలలో జరిగిన తప్పులను సరిదిద్ది రైతులకు న్యాయం చేయాలన్నారు. ప్రస్తుతం పాఠశాలలు, కాలేజీలలో చేరే విద్యార్థులకు కుల, కుల ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే అర్జీదారులకు వీఆర్వోలు అందుబాటులో ఉండి సకాలంలో సర్టిఫికెట్లను పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిషివర్మ, ఆర్ఐ దేవి, మండల సర్వేయర్ గణేష్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ఆధ్యాత్మిక శిక్షణా తరగతులు



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, జూన్ 2(ఆంధ్ర జ్యోతి): స్థానిక బ్రాహ్మణవీధి గీతా సంఘం భవనంలో నెల రోజులుగా చిన్నారులకు ఆధ్యాత్మిక అంశాలైన విష్ణు సహస్రనామం, భగవద్గీతలో నిష్ణాతులైన పండితులచే శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నారాయణ, గోవిందస్వామి, రామచంద్ర, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శిక్షణా తరగతుల్లో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

9న హుండీ లెక్కింపు

ఐరాల(కాణిపాకం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీని లెక్కించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో స్వామి కానుకలను లెక్కించనున్నట్లు ఆయన తెలియజేశారు. స్వామి కానుకల లెక్కింపు సమయంలో ఆలయ సిబ్బంది ఎవరూ సెలవు పెట్టరాదని స్పష్టం చేశారు.

అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవాలి

- జేసీని కోరిన పూతలపట్టు ఎమ్మెల్యే

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సరుకుల పంపిణీలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ జేసీ విద్యాధరిని కోరారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జేసీని కలిశారు. పూతలపట్టు నియోజకవర్గంలోని చౌకదుకాణాలకు కేటాయిపులు తగ్గాయని డీలర్లు పూర్తిస్థాయిలో సరుకులు ఇవ్వడం లేదని తెలియజేశారు. సరుకుల కేటాయింపులు ఎందుకు తగ్గాయో విచారణ చేయాలని కోరారు. జేసీ స్పందిస్తూ వీటిపై తగిన చర్య తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కొండ మల్లీశ్వరుడికి పూజలు



ఎగువ కన్నికాపురంలో స్వయంభు సిద్ధేశ్వరుడు

వెదురుకుప్పం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా పాలాభిషేకం, పూజలు చేశారు. స్వామిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. శివయ్య, అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పల్లకీ సేవలో ఊరేగించారు.

- చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు. తర్వాత పూల అలంకరణ సేవ నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.
- ఎగువ కన్నికాపురం వద్ద వెలసి ఉన్న మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పాలాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు.

కైలాసధామానికి రూ.లక్ష వితరణ



చెక్కును వితరణ చేస్తున్న చెంగల్‌రాయనాయుడు

చిత్తూరు రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్మశానవాటికలో నిర్మించిన కైలాసధామం నిర్వహణకు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ చెంగల్‌రాయ నాయుడు సోమవారం రూ.లక్ష వితరణ చేశారు. ఈ మొత్తాన్ని కైలాసధామం నిర్వాహకులు లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమం క్లబ్ సభ్యులు శ్రీధర్, నరేష్‌బాబు, చిట్టిబాబు, మోహన్, చంద్ర, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి



భూపాల్‌నాయుడు

గుడిపాల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎల్.పురం పంచాయతీ రఘునాథపురానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, పాల్యంకొండ ఆంజనేయస్వామి ఆలయకమిటీ మెంబరు భూపాల్‌నాయుడు సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మృతికి జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులునాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు నివాళులు అర్పించారు. అలాగే పాళ్యంకొండ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు, కార్యదర్శి తారకరామ్, కమిటీ సభ్యులు రాజు, కోటేశ్వరరావు,రమేష్, గిరి తదితరులు అంజలి ఘటించారు.

ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం

- బాగుపడిన రోడ్డు ● 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ స్థానికుల హర్షం





నాడు: దేవళంపేటలో చెరువును తలపిస్తున్న రోడ్డు నేడు: వానొచ్చినా రోడ్డుపై నీరు లేని దేవళంపేటలో రోడ్డు

వెదురుకుప్పం, జూన్2 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా వెదురుకుప్పం నుంచి కొత్తపల్లెమిట్ట వెళ్లే రహదారిలో దేవళంపేటలో రోడ్డు గుంతలు పడి, వర్షపు నీరు నిలిచి చెరువును తలపించేది. దీనివల్ల వాహనదారులు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వైసీపీ పాలనలో స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవళంపేటకు చెందిన టీడీపీ యువనేత బాష్యం సతీష్ నాయుడు రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. ఆయన వెంటనే జడ్పీ నిధులను రూ.4.5లక్షలు మంజూరు చేయించి, సమస్యకు పరిష్కారం చూపించారు. ప్రస్తుతం అక్కడ గుంతలు లేవు. వర్షం వచ్చినా నీరు నిల్వడం లేదు. ఇది మంచి ప్రభుత్వం అంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. థామస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కమనీయం వరదుడి కల్యాణం

హనుమంతు, గజవాహనాలపై విహారం ● నేడు రథోత్సవం



గజవాహనంపై విహరిస్తున్న స్వామివారు

యాదమరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలక్రేందంలో వెలసిన వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 12 రోజుల పాటు జరిగే వాహన సేవలను సాక్షాత్తు బ్రహ్మదేవుడే నిర్వహిస్తారని ప్రతీతి. అందుకే వీటికి 'బ్రహ్మోత్సవాలు' అనే పేరు వచ్చింది. సోమవారం ఉదయం వరదరాజ స్వామి నిత్యకైంకర్యాల అనంతరం హనుమంత వాహనంపై ఇంద్రవరదుడు పురవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్ర నాచ్చియార్ తిరుక్కోళం ఉత్సవంలో భాగంగా స్వామివారు మోహినీ అవతారంలో భక్తులను అనుగ్రహించారు.

- దివ్య కల్యాణ మహోత్సవం


సాయంత్రం స్వామి, అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి, వధూవరులుగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తులు గోవింద నామస్మరణల మధ్య కన్నుల పండువగా మాంగల్యధారణ జరిగింది. స్వామి, అమ్మవార్లకు హారతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కల్యాణ మహోత్సవం అనంతరం రాత్రి గజవాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర మంగళహారతులు సమర్పించారు.

- నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం మంగళవారం జరగనుంది. సాయంత్రం 4 గంటలకు వరదరాజస్వామి ఆది దంపతులు యాదమరి పురవీధుల్లో రథోత్సవంలో అధిరోహించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం తేరుమెట్ల ఉత్సవం, రాత్రి తోట ఉత్సవం జరగనున్నాయి.







1. మోహినీ అవతారం
2. కల్యాణోత్సవం
3. హనుమంత వాహనం

వైసీపీ నేతలు గొడ్డలిపోటు దినం జరపాలి

- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



చిత్తూరు సిటీ, జూన్2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు గొడ్డలిపోటు దినం జరపాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ప్రజారంజకపాలన చూసి ఓర్వలేక వైసీపీ నేతలు ఈ నెల 4 న 'వెన్నుపోటు దినం' చేస్తామంటూ ప్రకటించడం శోచనీయమన్నారు. వ్యవస్థలను నాశనంచేసి, దుర్మార్గాలు, దౌర్జన్యాలతో సాగిన వైసీపీ రాక్షస పాలన నుంచి ప్రజలు జూన్ 4న తమ అమూల్యమైన తీర్పుతో విముక్తి పొందారని చెప్పారు. ఇది ప్రజలకు పెద్ద పండుగరోజని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం దశలవారీగా మద్యపాన నిషేధం అమలు చేస్తామని చెప్పి కల్తీ మద్యం విక్రయించి వేలాదిమంది మహిళల మంగళ సూత్రాలు తెంచేసింది అన్నారు. వైసీపీ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు దొంగనాటకాలకు తెరతీస్తోందని, ప్రజలు నమ్మేపరిస్థితిలో లేరని పేర్కొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషిచేస్తా: ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సరిత

శ్రీరంగరాజపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీపీ సరిత అన్నారు. సోమవారం ఎస్ఆర్‌పురం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను తెలియజేశారు. వ్యవసాయ శాఖ అధికారి నర్మద మాట్లాడుతూ వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో మోహనమురళి మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమ్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లోకనాథం పిళ్లై జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ హరిత, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

4న వైసీపీ విముక్త దినం



మీడియాతో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యంనాయుడు

గుడిపాల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అవినీతి, దౌర్జన్యాలు, వ్యవస్థల దుర్వినియోగం, కుంభకోణాల నుంచి జూన్ 4న రాష్ట్ర ప్రజలు విముక్తి పొందారని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్లహేమాద్రినాయుడు అన్నారు. సోమ వారం వారు మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది జూన్ 4న ప్రజలు స్వాతంత్ర్యం కోసం ప్రజలు తీర్పునిచ్చారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రజారంజక పాలన చూసి ఓర్వలేక వైసీపీ జూన్ 4న వెన్నుపోటు దినంగా ప్రకటించి ప్రజా నిర్ణయాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. వైసీపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే గొడ్డలి పోటు దినం, తల్లిని, చెల్లిని గెంటేసిన దినం, అమ్మపై కేసు దినం నిర్వహించాలని పేర్కొన్నారు. ఐదేళ్ల పాలనలో కల్తీ మద్యంతో వేలాది మంది మహిళ పసుపు, కుంకుమలను దూరం చేసింది వైసీపీ ప్రభుత్వ కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ వ్యవస్థలను నాశనం చేసి అందినంత వరకు దోచేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. తమ ఉనికి కాపాడుకోవడానికే కూటమి ప్రభుత్వంపై బురద చల్లాలని ప్రయత్నిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయచంద్రగౌడ్, ఏకాంబరయాదవ్, రంగారెడ్డి, అరుణ్, ఆనందయాదవ్ పాల్గొన్నారు.

నేడు గంగజాతరలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, జూన్2:గిరంపేట న్యూ ప్రశాంత్‌నగర్ కాలనీలో వెలసిన నడివీధి గంగమ్మ జాతరను మంగళ, బుధవారాలలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. సోమవారం ప్రశాంత్ నగర్ గంగమ్మగుడి వద్ద జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ మంగళవారం అమ్మవారికి తొలి పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈపూజల్లో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొని అమ్మవారికి పూజలు చేస్తారని వారు తెలిపారు. బుధవారం అమ్మవారి ఊరేగింపు ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు రామచంద్ర, సౌందరరాజన్, శ్రీనివాసులు, రమేష్, శబరి, రాజా యాదవ్, మునిరాయల్, అంజి రాయల్, నరేష్ కుమార్, వీరప్ప, మాధవాచ్చారి, రాము, జగదీష్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- ఇరువారంలో మంగళ, బుధవారాలలో నడివీధి గంగమ్మ జాతరలు నిర్వహించనున్నారు.

వైభవంగా ధర్మరాజుల కల్యాణోత్సవం



స్వామివారికి నిర్వహిస్తున్న కల్యాణోత్సవం

గంగాధరనెల్లూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లేపల్లె గ్రామంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లె గ్రామంలో గల ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత యజ్ఞంలో భాగంగా 11వరోజు సోమవారం భాగవతారిణి రెడ్డెమ్మ ద్రౌపతి కల్యాణం హరికథాకాలక్షేపం నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవం జరిపిం చారు. ఈ ఉత్సవానికి ఎస్.లక్ష్మిరెడ్డిపల్లెకు చెందిన ప్రసాద్‌రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఎస్.లక్ష్మీరెడ్డిపల్లెకు చెందిన శంకరశెట్టి కుటుంబసభ్యులు అన్నదానం చేశారు. అదేవిధంగా వెంకటేశ్వర నాట్యకళామండలి బృందం నిర్వాహకులు కిరణ్ ఆధ్వర్యంలో ద్రౌపతి కల్యాణం నాటకాన్ని ప్రదర్శించారు. నెల్లేపల్లె సర్పంచ్ గంగయ్య యాదవ్, భారతం నిర్వాహకులు వెంకటరెడ్డి, జయరామిరెడ్డి, గుంటూరు దేవరాజులునాయుడు, పుష్పరాజ్, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రహదారే మురుగు కాలువ



తవణంపల్లె, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువతడకర వద్ద చిత్తూరు -బంగారుపాళ్యం వెళ్లే రహదారి మురుగు కాలువలా మారింది. నిత్యం రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా ప్రజలు నివసిస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడంతో వీరి ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. దీంతో నిత్యం వేలాది మంది వాహనదారులు, పాదచారులు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు.



ఇన్‌చార్జి తహసీల్దార్‌గా తులసీరామ్



గంగాధరనెల్లూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరు మండలానికి ఇన్‌చార్జి తహ సీల్దార్‌గా ఆలం తులసీరామ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈయన ఇదే కార్యాలయంలోనే డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

నగరపాలక కార్యాలయంలో వినతుల స్వీకరణ



బాధితురాలి నుంచి వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ నరసింహప్రసాద్ బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఇంజినీరింగ్ శాఖకు 3, రెవిన్యూకు 2, పబ్లిక్ హెల్త్‌కు 2, పింఛన్‌కు 1 చొప్పున మొత్తం ఎనిమిది అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణ

గంగాధరనెల్లూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4వ తేదీన వెన్నుపోటు దినం పేరుతో వైసీపీ నిరసన కార్యక్రమం చేపట్టనుంది. దీనికి సంబంధించి వాల్ పోస్టర్లను గంగాధరనెల్లూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద ఆ పార్టీ నేతలు ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో నాయకులు మునిరాజారెడ్డి, చిన్నమరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఏకాంబరం, సురేంద్రరెడ్డి, గోవిందరెడ్డి, వెంకటేశులురెడ్డి, ఢిల్లీ, జగదీష్, కేశవులు, కుట్టి పాల్గొన్నారు.

విజయపురం: విజయపురంలో వైసీపీ నాయకులు వెన్నుపోటు దినం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌నాయుడు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి శేఖర్‌రాజు, ఉపాధ్యక్షుడు సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కార్వేటినగరం మండల వైసీపీ అధ్యక్షుడు శేఖర్‌రాజు తెలిపారు. కార్వేటినగరంలో 'వెన్ను పోటు దినం' పోస్టర్లను ఆ పార్టీ శ్రేణులు ఆవిష్కరించారు.

ప్లాస్టిక్‌ను వినియోగించరాదు



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి బాలసుందరం

పూతలపట్టు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా అధికారులు బాలసుందరం, శాంతి మండలంలోని పేటఅగ్రహారం, తేనేపల్లి, పూతలపట్టు పంచాయతీల పరిధిలో ఉన్న దుకాణదారుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనారోగ్యాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్ రుక్మిణి, పంచాయతీ కార్యదర్శులు దేవిక, చరణ్‌ప్రకాష్, ధరణిచంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.